"అమ్మమ్మా! ఇవాళ మనం ఇద్దరం ఈ మంచం మీద కూచుని పాడుకుందాం దా" ముద్దుగా మాట్లాడుతూ, వాళ్ల అమ్మమ్మ చెయ్యిపట్టి లాగుతూ మంచం ఉన్నవేపు దారి తీసింది రాణి. జానకమ్మ మనవరాలి ఏమాటలకు పొంగిపోతూ "అలాగే పాడుకుందాం పద తల్లీ" అంటూ రాణిని ఎత్తి మంచంమీద కూర్చోబెట్టి పక్కనే ఆమె కూడా కూర్చుంది.

"మరే అమ్మమ్మా, నువ్వు రోజూ పాడే 'మధురాధిపతి' పాడు." అమ్మమ్మ వీపుమీద వాలి మెడచుట్టూ చేతులువేసి అంది రాణి.

"అలాగే తల్లీ"

"అమ్మమ్మోవ్, ఇదిగో నేనూ వచ్చేస్తున్నా నేను రాకుండానే మొదలెట్టావంటే నామీద ఒట్టు." అలవాటు ప్రకారం ఆటలనుండి తిరిగి వచ్చిన రేణు కాళ్లు కడుక్కోటానికి బాత్‌రూము లోనికి పోయింది.

"అక్క వద్దు అమ్మమ్మా, మనం ఇద్దరం ఒక జట్టు ఏం?" బుంగమూతి పెట్టి అమాయికంగా అడుగుతున్న రాణిని తనవైపు తిప్పుకొని చెంపలమీద ముద్దాడింది.

"అలా అనకూడదు తల్లీ, మన అక్కేగా?" అని నచ్చ చెప్పింది.

"ఉహూఁ. లొచ్చుసీ, ఫో అని పొద్దున నన్ను కసిరి కొట్టింది." అక్కమీద తనకుగల కోపానికి కారణం ఇది అని వివరించింది రాణి. జానకమ్మకు నవ్వు వచ్చింది.

తడికాళ్లను తుడుచుకొని టవల్‌ను ఎదురుగా ఉన్న ఓ కుర్చీపై పడేలా విసిరేసి "దాని మాటలు నమ్మవద్దు అమ్మమ్మా, పొద్దున్నేమో నా పుస్తకం నిండా పెన్సిల్ తీసుకొని అంతా గీకేసింది తన ఇష్టం వచ్చినట్లు. నా పుస్తకం పాడైతే మరి కసురుకోనా?" తన తప్పేమీ లేదనీ, తప్పంతా రాణిదే అన్న ధోరణిలో చెప్పింది రేణు.

"మీరిద్దరూ ఇలాగే పోట్లాడుతూఉంటే దేవుడికి కోపం వస్తుంది. అప్పుడేమో ...."

ఆమె మాటపూర్తి కాకుండానే మధ్యలో అందుకొని "లేదులే అమ్మమ్మా, అక్కకూడా మన జట్టే, లా రేణూ!" రాజీకి వచ్చింది రాణి ఈ దేవుడితో పెద్ద అవస్థ అన్నట్లు.

ప్రతిదినం ఆమెచేత మంచి మంచి కథలు చెప్పించుకోటం, కథలు ఏమీ చెప్పని రోజున పాటలు పాడించుకోవటం, నేర్చుకోవటం ఆ అక్కాచెల్లెళ్లిద్దరికీ ఓ అలవాటు. ఈ అలవాటు కూడా జానకమ్మే చేసింది. ఆమె కూతుర్నీ, అల్లుణ్ణీ, పిల్లల్నీ చూచిపోదామని వచ్చింది. త్వరలోనే తమ ఊరికి కూడా పోవాలని అనుకుంటూంది. రెండు వారాలనుంచి పిల్లలిద్దరికీ మధురాష్టకం నేర్పిస్తూంది. మధురాష్టకం పాట అంటే ఆవిడ కెంతో ఇష్టం.

రాణి, రేణుకన్నా చాలా చిన్నదే అయినప్పటికీ ఆ కంఠం మాత్రం కంచుమోగినట్లే.

"నిన్న నేర్చుకున్నదెంతవరకు వస్తూందో పాడండి చూద్దాం" అంది జానకమ్మ.

రేణు, రాణి కలిసి పాడితే జానకమ్మకిలా వినిపించింది.

"గోపీ మదులా లీలా మదులం
యుత్తం మదులం ముత్తం మదులం"

"ఈ రాణి నాతో కూడా కలిసి పాడితే అంత బావుండదు. చూడూ, నే ఒక్కదాన్నే ఎంచక్కా చెబుతానో.

"గోపీ మధురా లీలా మధురం,
యుక్తం మధురం ముక్తం మధురం
దృష్టం మధురం శిష్టం మధురం
మధురాధిపతే రఖిలం మధురం"

రేణు పాడటం ఆపిన వెంటనే జానకమ్మ రేణును దగ్గిరికి తీసుకొని హృదయానికి హత్తుకుంటూ

## బి. వి. రమణమ్మ

"నా బంగారుతల్లీ, ఎంత కమ్మని కంఠం నీది, ఒక్క అక్షరం పొల్లు పోకుండా ఎంత బాగా పాడేవు!" అని రేణును ముద్దు పెట్టుకుంది. తనను వదిలేసి రేణును దగ్గిరకు తీసుకోవటం రాణికేం నచ్చలేదు. రేణువైపు కసిగా చూడ సాగింది.

"నాకంటే నువ్వే ఎంతో బాగ పాడతావు. నువ్వు పాడితే చాలా బావుంటుంది అమ్మమ్మా." జానకమ్మ ఒడిలో ఒదిగిపోతూ అంది రేణు.

ఈ మాట వినగానే ఆమె హృదయం బాధపడింది. అప్రయత్నంగా ఆమె కళ్లు చెమర్చాయి.

మూర్తీభవించిన శాంతస్వరూపిణి జానకమ్మ. వయసు పైబడేకొలదీ నిరంతర గ్రంథావలోకనంలో భగవత్కైంకర్యనిత్యనైమిత్తికాది కార్యాలలో నిమగ్నురాలై, గతించిన కాలంలోని హృదయాన్ని రంపపుకోత కోసే కొన్ని సంఘటనలను మరిచి పోవటానికి ప్రయత్నిస్తూంటుంది. జీవితంలో ఎదురైన సంఘటనలు కొన్ని మంచివిగాని, మంచిని మించిన చెడువిగాని కొంతకాలానికి మరుగున పడిపోతాయి. మరికొన్ని ఎంత మరిచిపోదామన్నా మరిచిపోలేనివిగా ఎదటే నిలిచి ఉంటాయి.

మధురమైన మధురాష్టకానికీ, అంతకంటే మధురమైన మరో అనుబంధానికీ, జానకమ్మకూ ఎవరూ వివరించలేనటువంటి ఆత్మీయత ఉంది.

ఈనాడు రేణు అన్న మాటలకు ఒకప్పుడు ఇలాగే అరుణ తన ఒడిలో పడుకొని "అమ్మా, మధురాష్టకం నువ్వు పాడితే ఎంత బావుంటుందని! ఒకసారి పాడి వినిపించవూ?" అనేది. 'పదేళ్ల అరుణ నవ్వుని, కమ్మని కంఠంతో మధురాష్టకం అతి మధురంగా వినవచ్చేది' అనుకుంది జానకమ్మ.

'అరుణ, నాబంగారుతల్లి ఎక్కడుందో!' నవ్వుగా తనలో తానే గొణుక్కుంటున్న అమ్మమ్మను తలపైకెత్తి చూసింది రేణు. ఇంతవరకూ బుంగమూతి పెట్టి అమ్మమ్మనూ, రేణునూ గమనిస్తున్న రాణి, జానకమ్మ కనుకొలకుల్లో నిలిచిన కన్నీటిని చూడగానే,

"అరే, అమ్మమ్మా, ఏడుస్తున్నావా?" అని రేణువైపు చూసి, "ఈ రేణు అక్కయ్య లొచ్చుసి అంత బలువు. అబ్బ.. లే. రేణూ, మా అమ్మమ్మ కాలు నొప్పి" అంది. ఆమె కన్నీటికి కారణం రేణే అని తలంచింది ఆ పసిహృదయం.

దిగ్గున లేచి అయోమయంగా అమ్మమ్మ ముఖంలోకి చూస్తూ "ఏడుస్తున్నావా అమ్మమ్మా!" ఆశ్చర్యంగా అడిగింది రేణు.

"లేదు తల్లీ, అవలిస్తే కళ్లకు నీళ్లు వచ్చాయి. మీరు వెళ్లి అన్నం తిని రండి. తరవాత రేణూ, నీవు పదిహేనవ ఎక్కం అప్పజెప్పాలి. రాణి ఒకట్లు చెప్పాలి. వేగిరం తిని రండి" అంది ఆమె.

పాటలు చెబుతానన్న అమ్మమ్మ అంతలోనే ఒకట్లు చెప్పాలనగానే కోపం వచ్చింది రాణికి.

కాని రేణు "ఓ ....ఇప్పుడే వచ్చేస్తాం" అనగానే తానూ "ఒన్....తూ .త్రీ" అంటూ తుర్రుమంది లోపలికి రాణి.

ఎంత అణుచుకుందామన్నా ఆగని కన్నీరు జలజలా రాలింది జానకమ్మకు. అరుణ, ఎప్పుడూ కలకలలాడుతూ ఉండే అరుణ! వినయం, వివేకం, అణకువ, ఉట్టిపడే నిర్మల ముగ్ధహృదయిని అరుణ! ఒకసారి చూస్తే మరి మరిచిపోలేని సౌమ్యరూపిణి అరుణ! అరుణ ఆలోచనలతోబాటు గతజీవితం ఆమె దృష్టిముందు నిలిచింది.

* * *

"పారూ, ఓ బంగారూ, ఎక్కడున్నావో చప్పున రా తల్లీ. అంకంత ఇంట్లో నిన్ను వెదకాలంటే నాచేతకాదు గాని." పరుగులు తీస్తూ వచ్చి బయటినుంచే గట్టిగా లోపలున్న పార్వతికి వినవడేలా కేకలువేస్తూ మంచంమీద కూచుంది జానకి.

"ఎవరూ?" లోపలనుండే వినవచ్చింది జానకికి. ఆ కంఠధ్వని ఎవరిదో పసికట్టింది.

"నాపేరు జానకి అంటారు. అంతేగాదు. ఈ ఇంట్లో పార్వతి అనే గడుగ్గాయికి ప్రాణస్నేహితురాలినని కూడా తెలిసిన వారంటారు. ఆ శాల్తీ ఇంట్లో ఉంటే ఇలా రమ్మనండి." చిలిపిగా అంది జానకి.

"ఓహో అలాగా, దయచేయండి, దయచేయండి." లోపలినుంచి వచ్చిన పార్వతి కాస్త వంగి లోనికి ఆహ్వానిస్తున్నట్లు చేతులు చాపి అతిశయించిన ఆనందంతో అభినయించింది.

"నటనలు చాల్లే. నేను కేక వెయ్యగానే పరుగెడుతూ వస్తావని అనుకుంటే....." మూతి తిప్పింది జానకి.

పార్వతికి నవ్వు వచ్చింది జానకి అమాయకత్వానికి.

"ప్చ్, ఎంత పొరపాటు జరిగింది! ఏదీ ఈసారి మళ్లీ కేకవేయి. పరిగెత్తుకుంటూ వచ్చి మళ్లీ నిన్ను మీ బావగారి ఊరు చేరేలా...."

"చాల్చాల్లే. మాటలు నేర్చావుగాని...ఇంతసేపయినా ఇంకా జడ వేసుకోలేదేం? ఇదిగో. పూలదండ. త్వరగా జడ అల్లుకో. తోట కెళదాం మరి."

"సరేగాని, ఎలా ఉన్నారు మీ బావ? అయినా అప్పుడే వచ్చావేం? ఇంకా కొన్ని నెలలున్నా ఉంటావను కున్నాను —" అర్ధంలోనే ఆపి, ఏదో అర్థం వచ్చేలా కొంటెగా కళ్లు చిట్లించి పకపకా నవ్వింది పార్వతి.

పార్వతి చేసిన వేళాకోళానికి జానకి ముఖం అరుణిమ దాల్చింది. చిరుకోపంతో అంది: "నువ్విలాగే వాగుతూ కూర్చుంటే నే వెళ్లిపోతా."

"పో. నాకేం భయమా?"

జానకి చివాల్న లేచి బయటికి పోయింది. అయినా పార్వతి బెదిరిపోలేదు. కొన్నిక్షణాల తరవాత బయటి వాకిలికేసి చూస్తూ —

"తలుపుచాటున నక్కినక్కి చూసేదెవరో... నేనేం మా జానకి బావను కాదుగా" అని ఊరించింది పార్వతి.

"ఛీ...పాడుపిల్లా, నీకు కొంచెం కూడా కనికరమే లేదు. పోతానంటే పో అనటమే...." రివ్వున తలుపు చాటునుంచి లోపలికి వచ్చి తన ఆట కనిపెట్టిన పార్వతి నెత్తిన ఓ మొట్టికాయ మృదువుగా ఇచ్చింది జానకి.

"పోతామనే వాళ్లు పట్టుకున్నా ఉండరని నాకు తెలును." పార్వతి అంది.

"నీకన్ని తెలుసులే." బుంగమూతి పెట్టి పార్వతి పక్కనే కూలబడింది జానకి.

"బుంగమూతి పెట్టటం బలే అలవాటయినట్లుంది మధ్య."

"ఏయ్ పార్వతీ, ... నీకీ రోజు ఏదో పూనిందను కుంటా......"

"ఎప్పుడు వచ్చేవమ్మా జానకీ?" హాలు బయట నుండే జానకిని చూసి అడిగారు లోపలికి వస్తూ పార్వతి నాన్న దామోదరం పంతులుగారు.

"నమస్కారం మాస్టారూ. మధ్యాహ్నం వచ్చానండీ." వినమ్రంగా జవాబిచ్చింది జానకి.

"మీ వదిన, బావ అంతా బాగున్నారా అమ్మా?" కుశలప్రశ్న వేశారు.



ఓరగా పార్వతిని చూస్తూ పంతులుగారి ప్రశ్నలన్నిటికీ జవాబిచ్చింది జానకి.

జడ వేసుకొని తలలో పూలదండ సర్దుకుంటూ "నాన్నా! తోటకి వెళుతున్నాం" అంది పార్వతి.

"అలాగే తల్లీ. అయితే చీకటిపడకమునుపే ఇంటికి వచ్చేయండి."

జానకి లేనిది ఈ రెండువారాలు దిక్కుముఖం వేసుకొని ఏదో వేళకింత వండి తనకింత పెట్టి ముభావంగా ముక్తసరిగా జవాబిచ్చే పార్వతి నేడు సంతోషంగా ఉండటంతో పంతులుగారికి ఆనందం కలిగింది. పార్వతి ఆయన పంచప్రాణాలు మరి!

"అక్కడ కూడా రోజూ తోటకి వెళ్ళేవాళ్ళం. కాని ఇక్కడ అనుభవించిన ఆనందం నేనక్కడ పొందలేకపోయానంటే నమ్ము. ఒకొక్కసారి నిన్ను వెంటనే చూడాలన్న పిచ్చెత్తి పరిగెత్తుకొని వద్దామనిపించేది పారూ!" పచ్చని మెత్తని పచ్చికపై పార్వతి పక్కనే కూచుని తలను ఆమె భుజంమీద వాల్చి అంది జానకి.

"కొంపదీసి అలాగెప్పుడూ చేయలేదు గదా?" కిలకిలా నవ్వింది పార్వతి.

"పోదూ, నీ కెప్పుడూ తమాషాగానే ఉంటుంది నా మాట."

జానకి గొప్పింటి బిడ్డ. అయితేనేం హృదయం అంతకంటే గొప్పది. పార్వతికి, జానకికి అంతస్తులలోనేకాక మతంలో కూడా దగ్గిర సంబంధం లేదు. పార్వతి చిన్ననాటనే తల్లిని కోల్పోయింది. అప్పటి నుంచి తల్లీ, తండ్రీ తానే అయి పార్వతిని అల్లారుముద్దుగా పెంచారు పంతులుగారు. లంకంత ఇల్లూ, దుఃఖితమానసాలకు సాంత్వన కలిగించి ప్రపూర్ణ ప్రశాంతిని ప్రసాదించే వీణతప్ప ఇతర ఆస్తి ఏమాత్రమూ లేనివారు పంతులు.

ఆ ఊరికంతా తలలో నాలికవంటివాడు, ఆగర్భ శ్రీమంతుడు, ధర్మపరుడు, శాంతిశీలుడు అయిన పరంధామయ్యగారి ఏకైక పుత్రిక జానకి. జానకి కూడా పసితనంలోనే మాతృవిహీన కావటంచేత తండ్రికి మరింత చేరువైంది. పంతులుగారిచేత జానకికి వీణ నేర్పించే ఏర్పాటు చేయించారు జానకి నాన్నగారు. అప్పటినుంచేగాక చాలా చిన్నప్పటి స్నేహితులు జానకీ పార్వతులు.


పూలు కోయటానికని లేచారిద్దరూ. "ఎన్ని రోజులైందో తోటంతా తిరిగి!" మల్లెపూలు కోసుకుంటూ అంది పార్వతి. వెనుదిరిగి చూస్తే జానకి లేదక్కడ.

"పారూ, ఓ బంగారూ, ఇలా రా" గుబురుగానున్న మనోరంజితం చెట్టుకింద కాళ్ళెత్తి మునివేళ్ళపై నిల్చుని కొమ్మచివరనున్న మనోరంజితాన్ని కోయటానికి ప్రయత్నిస్తూ అంది

"జానకీ, జాగ్రత్త, ఆ చెట్టులో పాములుంటాయి. అదేమిటే, అంత చొరవగా దూరావు? చప్పున రా జానకీ!" ఆత్రం, భయం మేళవించిన స్వరంతో అంది పార్వతి.

"ఛీ... వట్టి అదురుగొడ్డువు. నన్నెడిపించమంటే మహాధైర్యంగా ముందుకు వస్తావుగాని. ఇంకెందుకూ పనికిరావు. త్వరగా ఓ కర్ర ఇలాతే ..." జానకి అంది.

"పాముందేమిటే? జానకీ. నీకు మొక్కుతానమ్మా, నా బంగారువిగదూ రావూ..." ఏడుపు దిగమింగుతూ అంది పార్వతి.





ళ్ళు చేరుకున్నారు.

● ● ● ●

పెళ్ళిచూపుల తంతు ముగిసిననాటి సాయంకాలం పార్వతి చెవిలో గుయ్‌మంది జానకి.

"అబ్బ...పోదూ..." సిగ్గు పడింది పార్వతి.

"[illegible] అంటావేమిటమ్మా — మరి ఇంతకూ చెప్పావు కాదేం?"

"పో... నాకు తెలీదు."

"తెలీకుండా ఎలా ఉంటుందిలే. అసలింతకీ ఎలా ఉంటాడంటావు? ఏం ఉద్యోగం చేస్తున్నాట్ట?"

"................"

"ఎంత మాయలమారి పెళ్ళికొడుకమ్మా! ఉన్నట్టుండి వాడనుకున్న మా పార్వతి మనసు ఎప్పుడు దోచాడు?" అని ఆశ్చర్యాన్ని అభినయిస్తూ "పోనీలే... బుర్రయినా మిగిల్చాడనుకుంటా" అంది పార్వతి తలను అటు ఇటు ఊపి.

"అరే...ఆ బుర్రకూడా ఆయనగారి ఆలోచనలతోనే నిండి పోయిందా? అయితే ఇక నావని గో...విం...దా!" అని వేళాకోళం చేసింది.

పార్వతి [illegible].

"[illegible] ఆ సంగతి [illegible] వచ్చి [illegible] ఉంటేవాళ్ళు" అంది జానకి.

"[illegible] ఏం తక్కువ తిన్నానని? నా ప్రాణాలు తోడేస్తున్నావు బాబు."

"అది సరేలే...మరి మొదలుపెట్టు అసలు కథ."

పార్వతి మొదలుపెట్టింది. "అనగనగా ఓ ఊళ్ళో ఓ పెళ్ళికొడుకట. [illegible]..."

మధ్యలోనే అందుకుని "వగ్గేరా వగ్గేరా దు, డు [illegible] అయిన వరునకు జానెడు తోకయినా లేని ఈ వధువునిచ్చి వివాహం జరుగులాగున ఆర్యులు నిశ్చయించినారు. కావున ఈ వివాహానికి మేము రావా అంటావు" అంది జానకి.

"అక్కర్లా...."

"రాకుంటే...." తల ఎడం భుజంమీదుగా వంచి కళ్ళు విశాలం చేసింది జానకి.

"డొక్కచీల్చి డోలుకట్టి తంతం అని డమారా వాయిస్తూ ఊద్చుకుపోతాను."

"ఈ ముఖమేనా ఆ పని చేసేది అని."

"అనుమానమా?"

"అందుకు సందేహమా?"

"అయితే కాచుకోమరి..."

"అమ్మ బాబోయ్...ఇప్పుడే...వద్దులే. ఆ పని యూనికి కదా నీ వన్నది?"

"సరే పో...మన్నించాం."

"ఏడ్చావులే. ఇంతకూ ఆయనేం పని చేస్తాడే?"

"ఇంతగా అడుగుతున్నావు కాబట్టి చెబుతున్నాను. ఊపిరి అమ్ముతారు."

"అంటే ఉపాధ్యాయుడన్నమాట. భేష్ నీ తెలివికి మెచ్చాం. ఏదైనా కోరుకో."

"వద్దాం."

"అతే, ఎప్పుడూ ఈ మూర్ఖురాలు! కోరుకోమంటే దబ్బున ఏదో ఒకటి కోరాలిగాని. అనవసరంగా చచ్చాం, గిచ్చాం అంటూ పొడు ఇచ్చకాలతో కాలయాపన చేసి మాకు కోపం తెప్పిస్తూంది."

"మరి ఉన్నట్టుండి నీవు కోరికలు తీర్చే కల్పతరువై పోతే, ఈ సంగతి అందరికీ తెలిసిందంటే ఎవరైనా ఒకరు ఈ మనోమందిరం తలుపులు తెరుచుకొని [illegible] కావాలని కోరితే.. అమ్మో ...ఇంకేమయినా ఉందా?..."

"కోరితే గిరితే అదంతా జాంతానై. ముందే చెప్పేస్తాను. నా హృదయం ఓ మందిరం. ఒక్క పార్వతికే అందులో ప్రవేశించే అధికారం. మా పార్వతికి తెలియకుండా ఎవరైనా చొరబడ్డారంటే అంతా అంధకారబంధురం. ఈ విషయంలో తప్ప మరే కోరికనైనా కోరవచ్చునహో... అని దండోరా వేయిస్తానులే. నీ కా భయం అక్కర్లేదు."

"[illegible]" పార్వతి అంది.

"అన్నమాటేమిటి నీ మొహం. ఉన్నమాటే."

"పిచ్చితల్లులిద్దరూ చేరారా? ఏమమ్మా, ఎంత








(క్రిందటి సంచిక తరువాయి)

# విడివడని ఋణబంధం



బి. వి. రమణమ్మ

ఆ సాయంత్రం అలవాటుప్రకారం జానకి, మాష్టారి దగ్గరికి వెళ్లింది. ఇంటికి తాళంవేసి ఉండటం చేత వెను తిరిగి వచ్చింది. నాలుగైదురోజుల్దైనా పంతులుగారు కనిపించలేదు. ఆ దారినే పోతున్న పోస్టుమాన్ చెప్పాడు, ఏదో టెలిగ్రాము వస్తే పార్వతి అత్తగారి ఊరు వెళ్లిపోయారని. పోస్టుమాన్‌కు తెలియదా టెలిగ్రాములోని విషయం? అడుగుదామను కుందిగాని అతడప్పుడే సందు మలుపు తిరిగి పోయాడు. వ్యాకుల చిత్తంతో వెనుతిరిగి వచ్చింది. రామానికీ విషయం చెప్పింది. అతనికీ ఏమి అర్థం కాలేదు. అయినా అనవసరంగా బాధ పడవద్దని మాత్రం జానకికి చెప్పాడు.

పంతులుగారు వచ్చారని, తనకు దారిలో కనిపించారని రాముడు చెప్పగా విని జానకి కనకదుర్గకయినా చెప్ప కుండా పోయింది. అప్పటికి రామం ఇంట్లో లేడు. గబగబా పోయిన జానకి నిశ్శబ్దం రాజ్యం ఏలుతున్న హాలులో అడుగుపెట్టింది. పంతులుగారు కనిపించలేదు.

"మాష్టారూ......" పిలిచింది గట్టిగా.

"రా...జానీ!" ఆ పిలుపు వినగానే నాగస్వరం విన్న నాగులా గబగబా లోపలికి వెళ్లింది "పారూ" అంటూ.

ఎదురుపడిన ఆకారాన్ని చూడగానే కెవ్వున కేక వేసింది జానకి.

"నేను జానకీ ... పార్వతిని — భయపడ్డావా?" ఆదరణ, వేదన మిళితమైన స్వరంతో అంది పార్వతి.

"పారూ, నువ్వేనా? ఏమిటిది?" గట్టిగా కౌగ లించుకొంది. దుఃఖం పెల్లుబికింది జానకికి. జానకిని పెనవేసికొని ఆమె తలమీద తన గడ్డాన్ని చేర్చి కుమిలి కుమిలి ఏడ్చింది పార్వతి.

"పా...రూ...." గుండెలు పగిలేలా రోదించసాగింది. "భగవంతు డెంత గుడ్డివాడు! ఇంత అన్యాయం నా పార్వతికే జరగాలా?"

"పిచ్చి జానకీ, అన్యాయం అని ఎందుకనుకోవాలి? నేను నోచుకున్న నోముకు భగవంతుడు నిర్దేశించిన న్యాయమే ఎందుకు కాకూడదు?" కళ్లు తుడుచు కొని గంభీరస్వరాన అంది పార్వతి.

పార్వతి ముఖంలోకి తలఎత్తి చూచింది. ఎడతెగని వర్షానికి తడిసి, రంగుమాసి, సౌరభ సున్నితాలను బాసిన వికసితపుష్పం ముకుళించిన రీతిగా ఉందా వదనం. నిండుగా శోభను చేకూర్చే కుంకుమ చెదిరి పోయి కొద్దిరోజులే అయింది. మబ్బులచాటున అణిగి పోయిన చంద్రుని చుట్టూ ఉన్న వెలుగు అస్పష్టంగా కనిపించినట్లు కుంకుమ పెట్టుకున్న గుర్తు తెల్లని మచ్చలా కనిపిస్తూంది. పచ్చని గాజులతో గలగలలాడే తెల్లని చేతులు మోడువారిన వృక్షపు కొమ్మల్లా బోసిపోయి ఉన్నాయి. పమిట సందులో నల్లపూసల తాడులో తళుక్కున మెరిసే మంగళసూత్రం తెగి పోయి ఆ స్థానాన్నే పైకి తేలిన ఎముకలు నరాలు ఏవో అలంకరణల్లా బోసి మెడచుట్టూ ఉన్నాయి. ఆ రూపం ఇక చూడలేకపోయింది జానకి. చేతుల్లో ముఖం కప్పుకొని విలపించసాగింది. ఆమె బాధ ఎలాంటిదో చెప్పాలంటే భాష్యం, భావం చాలవేమో. దుస్సహమైన భరించరాని వేదన పార్వతివట్ల మాత్రమే

లేచి మంచాలు వాల్చి పక్కలువేసింది. నెమ్మదిగా కళ్ళు తుడుచుకొని లేచి వచ్చింది పార్వతి.

ఓ మంచంపై వెల్లకిలా పడుకొని ఉన్న జానకిని చూసి అంది: "ఇంటికి పోవూ?"

"పోను."

"రాముడు వచ్చేవరకూ ఉంటావా? లేక సాయం ఎవరినైనా పంపేదా?"

"అవసరం లేదు. నే నీపూట పోను."

"అదేమిటి... రామం ఏమయినా అనుకోడు? ఇది బాగులేదు. వెళ్ళు జానకీ."

"ఏమీ అనుకోడు. రామానికి తెలుసు."

"అయినా నాకేం నచ్చలేదు. ఇంటికి వెడితేనే బావుంటుంది నీవు."

"ఇక అట్టే మాట్లాడక పడుకో, మాట్లాడి అలిసి పోయావుగాని."

అంత బాధలోనూ తృప్తిగా నవ్వింది పార్వతి జానకి మాటలకు. పక్కపై తానూ ఒరిగింది.

నిద్రిస్తున్న పార్వతిని తదేకంగా చూస్తూ, పలు విధాలా ఆలోచిస్తూ పడుకుంది కాని ఆ రాత్రి నిద్ర పోలేదు జానకి.

మరుచటిరోజు ప్రసవవేదన పడుతున్న పార్వతి పరిస్థితి భయంకరంగా పరిణమించింది. ఆమె బలహీన శరీరం నరకయాతన అనుభవిస్తున్నట్లుంది. గది బయట వరండాలో కళ్ళు మూసుకొని కూచుంది జానకి. ఏ దేవతలను అండగా ఉండమని కోరుకొంటున్నదో!

"మిసెస్ రామం!"

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. ఎదురుగా లేడీ డాక్టర్. ఆమె అంది: "ప్రసవం జరిగేందుకు ఇక అర్ధగంటయినా పడుతుంది. కాని ఆమె చాలా బలహీనంగా ఉంది. బ్రతుకుతుందో లేదో చెప్పటం కష్టం."

"చెప్పవద్దండి, డాక్టర్! కాని...బ్రతికించేందుకు ప్రయత్నించండి."

నిర్వికారంగా ఉన్న ఆమెకేసి ఆశ్చర్యంగా చూసింది డాక్టరమ్మ. తరవాత కొన్ని క్షణాలకు తేరుకొని "అలాగే... నా శాయశక్తులా ప్రయత్నిస్తాను." లోనికి పోయింది.

వరండా బయట కాంపౌండు లోపల పచార్లు చేస్తున్న రామం జానకిని ఓ అరనిమిషంపాటు చూసి మరలా ఏదో ఆలోచిస్తూ పచార్లు సాగించాడు.

ఓ అర్ధగంటకు కార్‌మంటున్న శిశువు అరుపు విన్న రామం వదనంలో సంతోషం వెల్లివిరిసింది. కాని జానకి ఉలిక్కిపడింది. అర్ధంగాని రామం జానకిచెంత చేరాడు. లోపలనుంచి కర్టెన్ తీసుకుంటూ వచ్చిన నర్స్ "బిడ్డ మాత్రమే బ్రతికింది ... కాని...." అంది.

"కానీ....." రామం ఆత్రంగా అడిగాడు.

"ఆమె చనిపోయింది!"

"ఆ!" రామం నిశ్చేష్టుడయ్యాడు.! జానకి స్పృహ తప్పి పడిపోయిందేమోనని వెనుదిరిగి చూశాడు. లేదు. నిర్వికారంగా నిర్విచారంగా కూర్చునిఉంది అలాగే. ఏ భావమూ ద్యోతకం కాలేదు ఆమె వదనంలో. రామం భయపడ్డాడు. ఆమె చెయ్యి గబుక్కున అందుకుని నాడి చూశాడు. ఎప్పటిలా ఆడుతూంది. "జానకీ!" పిలిచాడు నెమ్మదిగా.

"పదండి." లోపలికి దారి తీసింది.

పార్వతి మృతదేహంపై నిండా కప్పిన తెల్లని ముసుగును గొంతువరకుమాత్రమే తొలగించి రెండు చేతులతో పార్వతి ముఖాన్ని పట్టుకొని తదేకంగా చూడ సాగింది. రామం భయపడ్డాడు. ఏదో చెప్పాలను కున్నాడు. అయినా ఏమీ చెప్పలేకపోయాడు. ఒక సారి పార్వతి నుదుటిని ముద్దు పెట్టుకొని తిరిగి ముఖంమీదికి ముసుగును సవరిస్తున్నప్పుడు ఇక దుఃఖం పట్టలేకపోయింది. భోరున విలపించింది జానకి. కొంతసేపు గడిచిన తరవాత చివరిసారిగా పార్వతి పాదాలకు నమస్కరించింది. కన్నీటి బిందువులు రాలి పడ్డాయి ప్రాణంలేని పార్వతి పాదాలపై.

దూరంగా పడుకోబెట్టిన పాపను చేతుల్లోకి తీసుకొని, "పదండి, ఇంటికి పోదాం" అంది. ఇంతకు మునుపు జానకికి, ఈ జానకికి పోలికే లేదు. ఎంతో ధైర్యంగా ఉన్నట్లు కనిపించింది అతనికి. ఆమె చర్యలు గమనిస్తున్న ఆ పురుషునికి అర్ధంగానిది ఒక్కటి మాత్రమే అర్ధమయింది, మహామహులకు కూడా అర్ధంగానిది స్త్రీహృదయం అని.

జానకి నవమాసాలు మోసి కనలేదు. కాని పుట్టిన క్షణాన్నే తల్లిని పిల్లగాని, పిల్లను తల్లిగాని చూడ నోచుకోని క్షణాన్నే ఆ పసికూనకు తల్లి అయింది. సృష్టి వైచిత్ర్యం కాకుంటే పాలకోసం జానకికి గిలిగింతలు కలిగించింది కన్నైనా తెరవని ఆ పసిగుడ్డు ఆ విషాద సమయంలో.

మడీ, ఆచారం, నిష్ఠానియమాలంటే గొప్పవేనీ లేవని తలంచే కనకదుర్గకు కంటకప్రాయంగా ఉంది తమ మతంగాని, కులంగాని పిల్లను తెచ్చుకొని పెంచుకోవటం. అందులో పార్వతి బిడ్డ. తండ్రి చచ్చిన తరవాత పుట్టి, ఆ తరవాత తల్లిని చంపిన పిల్ల ఆవిడ దృష్టిలో.

ఆమె సంగతి బాగా తెలిసిఉండీ, నిష్ఠానియమాలను పాటించే సద్బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి ఉండీ రామంకూడా ఏమీ అనకపోవటంతో ఆమెకు చాలా ఆశ్చర్యం, కోపం కలిగాయి. కాని చూచి చూచి ఆ పసికూనను వదలమని చెప్పటానికి ఆమెలో ఏ మూలనో దాక్కొనిఉన్న స్త్రీ సహజమైన మాతృత్వం, మమత్వం అంగీకరించలేకపోయాయి. కాని ఆ పిల్ల అంటే మాత్రం ఏదో అంటరాని వస్తువన్నట్లు చూచేది.

కొన్ని నెలలు గడిచిన తరవాత అడిగింది: "ఎన్నాళ్ళని మన ఇంట్లో ఆ పిల్లను ఉంచుకోవటంరా రామం? తండ్రిపరంగా ఎవరూ లేరూ పెంచుకోవటానికి?"

మందహాసం చేసి అన్నాడు రామం:

"తండ్రి పరంగా ఉన్నా లేకపోయినా పార్వతి మాకప్పగించి పోయింది కాబట్టి ఇకపైన మనపిల్లే."

"మన పిల్లా? ఒరేయ్, నీకేమయినా తెలివి ఉందిరా? మన మతమా? కులమా? ఏముంది చెప్పు? ఆచారవంతుల ఇంట్లో పుట్టిన నీకిదేం బుద్ధిరా? అర్ధంగాక అడుగుతాను, ఏం సంబంధమని పెంచుకుంటావు?"

"నిజమే. ఇది నీ కర్ధంగాని సంబంధమే."

"రామం, బాగా చెపుతున్నాను. విను. నాలుగు నాజూకు మాటలల్లి కవిత్వం చెప్పినట్లు మాట్లాడటం కాదురా బ్రతుకంటే!"

"ఇంకేమిటి? మడి కట్టుకొని బ్రతకటమేనా జీవితం? నా దగ్గిర ఇంకెప్పుడు ఈ ప్రస్తావన తేవద్దు." విసురుగా వెళ్ళిపోయాడు రామం. విస్తుపోయింది కనకదుర్గ.

ప్రాకటం, గోడలు పట్టుకొని చిన్నగా నడవటం నేర్చుకుంది అరుణ. తనెంత బాగా నడవగలదో చూటేందుకని ఓరోజు పూజ చేసుకుంటున్న కనకదుర్గ పూజాగృహంలోనికి పోయింది. ఏదో పాడుకుంటూ పూజలో మునిగిన కనకదుర్గ వెనకాల పాకుతూ పోయి, అలవాటు ప్రకారం గోడ పట్టుకొని నిలబడవలిసింది, కనకదుర్గ వీపు ఆసరా చేసుకొని లేచి నిలబడింది. పూర్తిగా పూజలో మునిగిపోయిన కనకదుర్గ ఉలిక్కిపడి చూచి మితిమీరిన కోపంతో "ఓసి ముదనష్టపు ముండా, నీ



చిత్రం—నవీన్ కుమార్ సిలాస్
(అనంతపురం—2)

చేతులు విరగా, ఎంత హడలుగొట్టించావే...ఫో...అవతలికి, శనిగొట్టు మొహమా!" చీదరించుకుంది.

ఆ మాటలు అర్ధంగాకపోయినా గుడ్లురుముతూ కోపగించుకోవటం అర్ధం అయిందేమో భయపడి చేయి పట్టు విడిచి కిందపడింది. పడటమే తడువుగా ఏడుపు లంకించుకొంది. అరుణ ఏడుపు విని పరుగెత్తుకుంటూ వచ్చింది జానకి.

"ఏం తల్లీ, ఎవరేమన్నారు నిన్ను? ఎందుకేడుస్తున్నావు చిట్టీ?" ఎత్తుకొని గుండెల కదుముకుంటూ బుజ్జగించింది.

"ఇదిగో జానకమ్మా, పూజా పునస్కారం ఏమీ వద్దా నాకు? ఇదెక్కడి ప్రారబ్ధం? పదిసార్లు నెత్తిన నీరు గుమ్మరించుకోవాలంటే సాధ్యమవుతుందా నాకు? నీ ముద్దుల కూతురిని పొటుదాటి రానివ్వవద్దు. వెధవపిల్లా, వెధవ చేష్టలూ." ఖచ్చితంగా దండించింది కనకదుర్గ.

అరుణ కళ్ళనీళ్ళను తన చీర చెంగుతో తుడుస్తూ "పసిపిల్ల దానికేం తెలుసు వదినా? ఒక కేక వేసిఉంటే నేను తీసుకొని పోయేదాన్నిగా." ఇన్ని మాటలతో

